# కాంగ్రెస్‌ది నేరమయ మేధస్సు

**నా వ్యాఖ్యలను వక్రీకరించారు ☆ నాడు ఎల్లంపల్లిపై చర్చలోనూ ఇలానే చేశారు ☆ ఇప్పుడూ అదే జరుగుతోంది**

**కుతూహలమ్మపై మాకు అపార గౌరవం ☆ ఆమెను స్పీకర్‌ను చేస్తే సంతోషిస్తాం ☆ దళితులకు ఉన్నత పదవులిచ్చిన మాపైనే నిందలా: బాబు**

హైదరాబాద్ - న్యూస్‌టుడే

**రా**ష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'క్రిమినల్ బ్రెయిన్' (నేరమయ మేధస్సు)తో నడుస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు ఆరోపించారు. "దళితురాలైన ఉపసభాపతి కుతాహలమ్మను అవమానించేలా నేను మాట్లాడానని పాలకపక్షం చెప్పడం నీచాతినీచం. కుట్రపూరిత రాజకీయాలకు ఇది పరాకాష్ఠ. స్పీకర్ సురేష్‌రెడ్డి మాకిచ్చిన వాగ్దానం నెరవేరడం లేదని, సభకు ఆయనొచ్చి సమాధానం చెప్పేంతవరకు అసెంబ్లీ జరగడానికి వీల్లేదని నేను అన్నాను. ఈ నా మాటలను మంత్రి రోశయ్య వక్రీకరించి... దళిత డిప్యూటీ స్పీకర్‌ను అవమానించానంటూ నిందలేశారు. ఎంత దారుణమిది? నాడు ఎల్లంపల్లి అక్రమాలపై సభలో సాక్ష్యాధారాలతో మేం ప్రశ్నించినప్పుడు ఇదే రీతిలో పాలకపక్షం వక్రీకరించింది. ఇప్పుడూ అదే జరుగుతోంది" అని అన్నారు. దళితులపై కాంగ్రెస్‌కు నిజమైన ప్రేమే ఉంటే... సురేష్‌రెడ్డిని దించి, ఆ స్థానంలో కుతూహలమ్మను స్పీకర్‌గా చేయాలని డిమాండ్‌చేశారు. "ఎందుకంటే స్పీకర్‌గా సురేష్‌రెడ్డి వివాదాస్పదుడయ్యారు. పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. కాబట్టి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కుతూహలమ్మను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టడమే సమంజసం. ఇది జరిగితే మేం ఎంతో సంతోషిస్తాం. ప్రభుత్వానికి ఇది ఆమోదయోగ్యమైతే... కుతూహలమ్మ పేరును మేమే ప్రతిపాదిస్తాం" అని అన్నారు. బుధవారం రాత్రి సభ కొద్దిసేపు వాయిదాపడ్డాక... దళిత డిప్యూటీ స్పీకర్‌ను అవమానించేలా చంద్రబాబు మాట్లాడారంటూ కాంగ్రెస్ ఎస్సీ ఎమ్మెల్యేలు కొందరు లాబీల్లో నినదించారు. ఇందుకు ప్రతిగా తెదే ఎస్సీ ఎమ్మెల్యేలు కూడా 'దళితులకు నిజమైన ద్రోహి వైఎస్సే'నంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇలా లాబీల్లో పరిస్థితి కొద్దిసేపు ఉద్రిక్తంగా మారిన తరుణంలో చంద్రబాబు తన ఛాంబర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉపసభాపతి కుతూహలమ్మను అవమానించేలా తానెక్కడా మాట్లాడలేదన్నారు. "కుతూహలమ్మపై మాకు అపారగౌరవం. ఆమెను రాజకీయాల్లోకి తెచ్చిందే నేను. ఆమెను నేను అవమానించేలా మాట్లాడటమేమిటి? నిజానికి దళితులంటే నాకు ఎంతో అభిమానం. దళితులకు రాజ్యాంగబద్ధ పదవులిచ్చిన ఘనత తెదేపాదే. లోక్‌సభ స్పీకర్ పీఠంపై బాలయోగిని, రాష్ట్ర శాసన సభాపతి పదవిలో ప్రతిభాభారతిని కూర్చోపెట్టింది మేమే. కె.ఆర్.నారాయణన్ రాష్ట్రపతి కావడానికి కృషిచేశాం. దళితులకు ఉన్నత పదవులే ఇవ్వని కాంగ్రెస్ వాళ్లా మమ్మల్ని విమర్శించేది?" అని ప్రశ్నించారు.

### కుతూహలమ్మ కూర్చున్నప్పుడే మైకు వచ్చింది!

స్పీకర్ పీఠంపై కుతూహలమ్మ కూర్చున్న సందర్భాల్లో తెదే ఎమ్మెల్యేలంతా ఆనందంతో ఉండేవారని బాబు తెలిపారు. "ఎందుకంటే సభాపతి స్థానంలో ఆమె ఎప్పుడు కూర్చున్నా నిష్పక్షపాతంగా వ్యవహరించారు. సభలో మాకు మైక్ దొరికిన సందర్భాలు ఉన్నాయంటే అవి కుతూహలమ్మ ఉన్నప్పుడు మాత్రమే" అని అన్నారు. ఆమెపై తమకు అమితమైన అభిమానముందన్నారు. "ఆమెపై మాకు వీసమంత కూడా అసంతృప్తి లేదు. ఆమె స్వతంత్రురాలు కాదు. ఆమే స్పీకర్ అయి ఉంటే కచ్చితంగా మాకు మైక్ ఇచ్చేవారు" అని చెప్పారు. తాము స్పీకర్ తీరుపై మాత్రమే యుద్ధం చేస్తున్నామని, డిప్యూటీ స్పీకర్‌పై కానేకాదన్నారు.

### స్పీకర్ తీరు సరికాదు

స్పీకర్ సురేష్‌రెడ్డి తమను అడుగడుగునా బాధపెట్టారని బాబు వ్యాఖ్యానించారు. "ఈరోజు (బుధవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకు స్పీకర్ గారు పెద్ద డ్రామా జరిపారు. అవిశ్వాసంపై ప్రభుత్వ సమాధానం ఐదు గంటలుంటుందని ఆయన తొలిరోజు చెప్పారు. అందుకు విరుద్ధంగా సభలో జరిగింది. మంత్రులు గంటల కొద్దీ మాట్లాడుతున్నారు. దీనిపై మేం ప్రశ్నిస్తే... సమయం కంటే విషయం ముఖ్యమన్నారు. మా వద్దకు వచ్చేసరికి నిర్దేశిత సమయానికి మించి ఒక్క నిమిషం కూడా అదనంగా ఇచ్చేది లేదన్నారు. విషయం కంటే సమయం ముఖ్యమన్నారు. చివరకు ఎమ్మెల్యేల ఆస్తులపై విచారణ జరిపించే విషయంలోనూ ప్రభుత్వ ఒత్తిడికి స్పీకర్ తలొగ్గారు" అని విమర్శించారు. వైఎస్ రహస్య ఎజెండాను స్పీకర్ అమలుచేస్తున్నారన్నారు. అందుకే తాను అసెంబ్లీని కౌరవసభతో పోల్చానని చెప్పారు. "పాలక పక్షానికి స్పీకర్ సుదీర్ఘంగా మైక్ ఇచ్చి... వాళ్ల చేత ఇష్టారాజ్యంగా మమ్మల్ని తిట్టిస్తున్నారు. కానీ సమాధానం చెప్పుకునేందుకు మాకు మాత్రం మైకే ఇవ్వడంలేదు. చివరకు అవిశ్వాసంపై చర్చలోనూ ఇదే పరిస్థితి. మా నోరు నొక్కుతున్నారు. మంత్రి రఘువీరారెడ్డి సుదీర్ఘంగా మాట్లాడుతున్నప్పుడు... దీనిపై మా ఎమ్మెల్యేలు స్పీకర్ ఛాంబర్ వద్దకు వెళ్లి ధర్నా జరిపి వచ్చారు. అయినా కూడా ఆయన సరిగా స్పందించలేదు. దాంతో నేను డిప్యూటీ స్పీకర్‌ను అడిగాను. స్పీకర్ మాకు మాట ఇచ్చారని, ఆయన చెప్పిన దానికి విరుద్ధంగా సభలో జరుగుతోందన్నాను. అందువల్ల ఆయన వచ్చి సమాధానం చెప్పేంత వరకు సభ జరగడానికి వీల్లేదన్నాను. ఇందులో తప్పేంఉంది? వీటిని వక్రీకరించి కుతూహలమ్మను అవమానించానంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది" అని ధ్వజమెత్తారు. తనకు అర్ధరాత్రి ప్రసంగించే అవకాశం ఇవ్వాలన్న కుట్రపూరిత వ్యూహంతో అధికారపక్షం వ్యవహరించిందన్నారు. దీన్నే సభలో తాను లేవనెత్తానని చెప్పారు.

### కుర్చీకి చెడ్డపేరు తెస్తున్నారు!

స్పీకర్ కుర్చీకి సురేష్‌రెడ్డి చెడ్డపేరు తెస్తున్నారని బాబు ఆరోపించారు. "అవతలి పక్షానికి మైక్ ఇచ్చి మరీ మమ్మల్ని తిట్టిస్తున్నారు. వాళ్లను ఇంకా ఉత్సాహపరుస్తున్నారు. సభలో మా గొంతు నొక్కుతున్నారని స్పీకర్‌ను మేం అడిగితే... ఆయన చాలా నింపాదిగా స్పందిస్తున్నారు. ఏదైనా ఉంటే తనపై అవిశ్వాసం పెట్టుకోండని సూచిస్తున్నారు. అలా చెప్పడం పద్ధతేనా?" అని ప్రశ్నించారు. ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరించే వ్యక్తి అలాంటి స్థానంలో కూర్చోవచ్చా?" అని ప్రశ్నించారు. చారిత్రాత్మకమైన అవిశ్వాసంపై చర్చను కూడా అవహేళన చేసిన ఘనత వైఎస్ సర్కారుదేనని దుయ్యబట్టారు.

### సీడీ చూసి... బాబు తప్పులేదన్న లెఫ్ట్ నేతలు

అనంతరం బాబు ఛాంబర్‌కు సీపీఐ శాసనసభాపక్ష నేత చాడ వెంకటరెడ్డి, సీపీఎం ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిలు వచ్చారు. ఉపసభాపతి కుతూహలమ్మను ఉద్దేశించి సభలో తాను చేసిన వ్యాఖ్యల సీడీని విలేకర్ల సమక్షంలో లెఫ్ట్ నేతలిద్దరికీ బాబు ప్రదర్శించి చూపారు. ఆనక వామపక్ష నేతలు... "బాబు గారూ! మీరెక్కడా తప్పుగా మాట్లాడలేదు. సభలోకి స్పీకర్ రావాలని మాత్రమే అన్నారు" అని తెదే అధినేతతో అన్నారు.